# యోనాతాను
# వీడని విశ్వాసపు గారడీలు

నీ నౌకాదళాన్ని కార్తేజ్‌కి విరోధంగా ఏ ధైర్యంతో పోనిస్తున్నావని ఒకడు సిసిలీలో పెద్దదైన స్కిపియోన్ను అడిగాడట. అందుకు యుద్ధ ఆయుధాలను ధరించి శిక్షితులైయున్న మూడు వందల మంది మనుష్యులను, తీరంలో ఉన్న ఎత్తయిన ఒక గోపురాన్ని చూపి వానితో అతడు యిలా అన్నాడు: "నేను ఆజ్ఞాపిస్తే, గోపుర శిఖరానికి వెళ్లి తల్లక్రిందులుగా క్రిందికి దుముకనివాడు వారిలో ఒక్కడును లేడు." స్కిపియో వెళ్లి, శత్రు శిబిరంలో దిగి, దాన్ని తగులబెట్టాడు. తమ ఓడలను, ఏనుగులను డబ్బును కార్తేజ్‌వారు యివ్వ సిద్ధపడి అతనికి లొంగిపోయారు. తిరుగులేని సైనికుల విశ్వాసం (ప్రభు భక్తి) అతనికి విజయాన్ని సంపాదించింది.

ఈ కథలో ఉన్న ఒక్క విశేషం యోనాతాను జీవితంలో ప్రాధాన్యతను పొందింది, అది **విశ్వాసం** (ప్రభు భక్తి). మొదటి సమూయేలు గ్రంథంలోని విశేషమైన వ్యక్తులలో ఇతడొకడు. ఇతడు సౌలుకు జ్యేష్ఠ కుమారుడు, యువరాజు. యోనాతానునందు – నిర్భయమైన సైనికుడు, తన సైనికులనుంచి లజ్జరహితమైన విశ్వాసాన్ని చూరగొన్న సైన్యాధిపతి, మానవ ప్రేమ శిఖరాగ్ర స్థాయిని కనుపరచే ఒక్క స్నేహితుడు, దేవునియందు మహా గొప్ప నమ్మిక కలిగినవాడు అనే మహా గంభీరమైన సత్ లక్షణాలు మూర్తీభవించాయి. యోనాతాను సత్యాన్ని పలికి, పవిత్రమైన జీవితం జీవించి, తాను గుర్తించిన ప్రతి తప్పును సరిదిద్దాలని ప్రయాసపడిన వ్యక్తి. అతని ఉత్తమమైన శీలానికి బద్ధ విరోధమైన శీలాన్ని కలవాడు అతని తండ్రి!

## అతని విశ్వాసం (ప్రభు భక్తి)

నమ్మకత్వంగా ఉంచే దేవుని ఆజ్ఞలను యోనాతాను బాగుగా ఎరుగును (నిర్గమ. 22:28; సంఖ్యా. 27:20; ద్వితీయో. 7:9; సామె. 24:21; వగైరాలు). ఈ విషయమందు అతడు దేవుని చిత్తాన్ని అనుసరించడంలో జాగ్రత్తగా ఉన్నాడు. అతని విశ్వాసాన్ని ప్రస్తావించిన మూడు అంశాలను ఆలోచించు.

**దేవుని యెడల విశ్వాసం (14:45)**

యోనాతానును గూర్చిన తొలి రిఫరెన్సులో, అతడు దేవుని బాగుగా ఎరిగినవాడుగాను, సర్వశక్తునియందు ఆధారపడినట్టి నమ్మిక కలిగినవాడుగాను కన్పిస్తాడు. 1 సమూ. 14:6 యిలా అంటుంది: "యోనాతాను – ఈ సున్నతిలేనివారి దండు కాపరుల మీదికి పోదము రమ్ము, యెహోవా మన కార్యమును సాగించునేమో, అనేకులచేతనైనను కొద్దిమందిచేతనైనను రక్షించుటకు యెహోవాకు అడ్డమా అని తన ఆయుధములు

మోయువానితో చెప్పగా ...” దేవుని యందలి యోనాతానుకు గల నమ్మిక చలించనిది. (14:12బి).

1 సమూయేలులోని పలు లేఖన భాగాలలో ఈ విశ్వాసం (ప్రభు భక్తి) ప్రదర్శింప బడింది. గాతువాడైన గొల్యాతును దావీదు చంపగా సౌలు యోనాతానులు తిలకించి నప్పుడు, యోనాతాను అందులో దేవుని హస్తాన్ని చూచాడు (19:5). సౌలు అసూయవలన దావీదు యోనాతానులు వేరు కాబోతున్న సందర్భంలో – దేవుడు దావీదుతో ఉన్నాడని తెలుసు కోవడం, తన దుఃఖంలో యోనాతాను ఆదరణను కనుగొన్నాడు (20:42). చివరిసారిగా ఆ యిద్దరు స్నేహితులు కలసికొన్నప్పుడు, దేవునియందలి యోనాతాను నమ్మికయే ప్రధానపాత్ర వహించింది (23:16). యోనాతాను యొక్క విశ్వాసం దావీదుకు బలాన్ని యిచ్చింది.

ఈ వాస్తవాలు ఏకమై యోనాతానును బలమైన విశ్వాస వీరునిగా చిత్రించాయి. భూ సంబంధమైన సంఘర్షణ, విచారము, కృంగిపోవడం అనేవాటికన్నా తన దేవుని యందలి విశ్వాసాన్ని బట్టి అతడు ఎత్తుగా నిలువగలిగాడు! యోనాతాను నిరీక్షించ గలిగిందంతా, దేవుని సంకల్పంలోను, ఏర్పాటులోను కేవలం తానొక సాధనంగా ఉండడమే. తనయందు అల్ప విశ్వాసము, దేవునియందు అద్భుతమైన విశ్వాసంగలవాడు యోనాతాను! దేవుని బలాన్ని అతడు ఆశ్రయించియున్నందున యోనాతాను జయించాడు (మార్కు 11:24తో పోల్చి చూడు).

దేవునికి యోనాతాను చూపిన విశ్వాసానికి సంబంధించి, “అతడు దేవునితో పని చేసెను” (14:45బి) అనే దానికంటె శ్రేష్ఠమైన కామెంట్ మరి ఏదియు లేదు.

### స్నేహితుని విశ్వాసం (18:1)

దావీదు యోనాతానులు స్థిరమైనదియు, సమర్పణతో కూడినదియునైన స్నేహాన్ని పంచుకున్నారు (18:3, 4). ఒకని వస్త్రములు మరియొకడు మార్చుకొనడంవలన వారు తమ స్నేహ బంధాన్ని ముద్రించుకున్నారు. ఒకరితో ఒకనికిగల బాంధవ్యాన్ని అది చిత్రిస్తుంది. ఒకడు యోనాతానుతో పోరాడుతున్నట్టయితే, దావీదుతో పోరాడుతున్నట్టు భావింపబడుతుంది. ఇద్దరు స్నేహితుల మధ్య గల యిట్టి నిబంధన అత్యున్నతమైనదై ఉంటుంది.

తాను ఎన్నడు రాజుగా ఉండబోననే విషయం యోనాతానుకు తెలుసు (23:17), అయినా ఆతనియందు అసూయ ఏ రూపంగాను కన్పించదు. దావీదు పట్ల అతనికున్న నమ్మకత్వం, తన స్నేహితునికి అత్యంత గొప్ప ఉపకారం చేయడానికే కృషి సల్పింది. నిజమైన స్నేహంలో **త్యాగపూరితమైన సద్గుణం** ఉన్నట్టు యోనాతాను ఈ విధంగా బయలుపరచాడు.

యోనాతాను స్నేహంలో, నిజమైన స్నేహానికి విశేష లక్ష్యములైన “బహు ఇష్టత” (19:1, “భక్తి”; NEB); యథార్థత (20:9); ఒప్పగించుకొన్న అనురాగం (20:42; 2 సమూ. 1:26); ప్రోత్సహించడం మరియు బలపరచడం అనేవి ఉన్నాయి (23:16).

కీర్తన. 133 చదువుతుండగా, యోనాతాను దావీదులచే పంచుకోబడిన అందమైన

స్నేహం జ్ఞాపకం. ఈ స్నేహ బంధాన్ని ఈ క్రింద చెప్పబడిన చారిత్రక వివరణ ఉదహరిస్తుంది. గ్రీసు దేశీయుల చరిత్రలో ఇపమినోన్‌డస్ మరియు పెలోపిడస్ అనేవారి స్నేహము వివరించబడింది. వారిద్దరు తమ కవచములను మాంటినియా యుద్ధంలో ఏకంగా బిగించి పోరాడారట. కడకు పలు గాయాలవలన రక్తసిక్తమై పెలోపిడస్ పడిపోయేవరకు పోరాడాడు. తన స్నేహితుని దేహాన్ని వదలి వెళ్లడంకంటె తానును చనిపోయేవరకు పోరాడడం యుక్తమని ఇపమినోన్‌డస్ తీర్మానించుకున్నాడు. అతడు సయితం చాలా గాయపడి, ఎవరో ఒకరు వచ్చి తనను రక్షించేవరకు అతడు పోరాడు తున్నాడట. చనిపోయినట్టు భావించిన అతని స్నేహితుడును, అతడును రక్షింపబడ్డారు. అది మొదలుకొని వారి స్నేహము సామెతగా మారింది. వారిరువురు తేబియన్ సైన్యానికి సైన్యాధిపతులయ్యారు. సమానమైన హోదా, సమానమైన అధికారంతో వారు జీవించినంత కాలం వారి మధ్య విరోధ భావాలు ఎన్నడు నెలకొనలేదు (సామె. 17:17ఎ; 18:24బి లను పోల్చి చూడు).

**కుమారుడుగా నమ్మకత్వం (2 సమూ. 1:23)**

ఈ నమ్మకత్వపు పరిధి యోనాతానును ఊహించలేని సంఘర్షణలకు నడిపించింది. ఇశ్రాయేలుకు తరువాత రాజుగా దేవుడు దావీదును అభిషేకించిన సంగతిని అతడెరుగును. ఆ విధంగా దేవునిపట్ల అతని నమ్మకత్వం దావీదును బయలుపరచేటట్లు అతనికి పిలుపునిచ్చింది (23:17). దావీదుతో తనకున్న స్నేహబంధం, దుర్మార్గ పథకాలకు సహకరించక నమ్మకంగా ఉండేలా చేసింది. (20:2, 9; 23:17). అయితే తన తండ్రిపట్ల నమ్మకత్వం సౌలును సపోర్టు చేసేలా బలవంతపెట్టింది! అతని యౌవన హృదయం ఈ మూడింటిని తూచి ఈ సంఘర్షణలను తీర్మానించవలసి వచ్చింది. అతడు “గ్రుడ్డు పెంకు మీద నడువవలసి వచ్చింది” చిత్రమైన “గారడీ పనులను” చేయవలసి వచ్చిందని చెప్పవచ్చు.

యోనాతాను సౌలుతోనే ఉండిపోయాడు. అతడు తండ్రికి విశ్వాసంగలవాడుగా ఉన్నాడు, కాని అతడు దేవునికిని దావీదుకును నమ్మకంగా ఉండేలా నడుచుకున్నాడు (23:16, 17). సౌలు ఆరంభ దినాల్లో, తన తండ్రికి నమ్మకంగా ఉండడంలో యోనాతానుకు కష్టం లేదు. సౌలు దేవునితో ఏకీభవించి ఉన్నాడని యోనాతాను ఎరుగు. అయితే సౌలుకు తిరుగుబాటు వచ్చింది, దేవుడు రాజును విడిచిపెట్టాడు, దుష్ట శక్తులు అతని నడిపించాయి. సౌలు ఉన్న మహా గొప్ప కోపోద్రేక సమయాల్లో, యోనాతాను సౌలుతోనే ఉండిపోయాడు. ఆ దుష్టత్వాన్ని త్రిప్పికొట్టవచ్చని అతడు నిరీక్షించాడో, ఏమో. అతడు ఎంపిక చేసికొన్నది అనేక పరీక్షలను అతనికి తెచ్చింది. అయితే యోనాతాను తాను ఎన్నుకున్న మార్గంనుండి ఎన్నడు చలించ లేదు (20:30–33).

గిల్బోవ పర్వతానికి సౌలు వెళ్లినప్పుడు, యోనాతాను కూడా అతనితో ఉన్నాడు. ఆ పర్వతం మీద, తండ్రి కుమారుడు యిద్దరు మృతినొందారు.

బిడ్డలు తల్లిదండ్రులకు నమ్మకంగా ఉండాలనే విషయం బైబిలు స్పష్టంగా బోధిస్తుంది (లేవీ. 20:9; నిర్గమ. 20:12; మొదలైనవి). యోనాతానువలె తన తల్లిదండ్రులకు

నమ్మకస్థులుగా, అతని అనుసరించే పిల్లలు దీవెనలు పొందుతారు. అయినా దేవుని పట్ల నమ్మకత్వం, తల్లిదండ్రులపట్ల నమ్మకత్వం అనేవి సంఘర్షణను తెచ్చినప్పుడు, ఎంతటి బాధ సంభవించినా, తల్లిదండ్రులకంటె దేవుని కోరుకోవలసిన అవసరం పిల్లలకు ఉంటుంది! (మత్తయి 10:34-39).

## నమ్మకపు పాఠాలు

**దేవునిపట్ల నమ్మకం మనేది అతి ప్రధానమైనది.** దేవుని పట్ల నమ్మకం మన హృదయాలలో నిండినదై జీవిత విధానంగా అది ఏ పరిస్థితిలోనైనా కాపాడబడుతూ ఉండాలి! బిషప్ బోనర్, జాన్ ఆర్డ్లీని వెనుకంజ వేయించాలనే ఆశతో స్తంభానికి కట్టి కాల్చివేస్తున్నప్పుడు కలిగే బాధను తెలిపినప్పుడు, ఆర్డ్లీ యిలా జవాబిచ్చాడు: “నా తలమీద ఎన్ని వెంట్రుకలున్నాయో అన్ని జీవితాలు నాకున్నట్టయితే, నేను క్రీస్తును పోగొట్టుకొనక ముందు (విడిచిపెట్టక ముందు) అన్ని జీవితాలను నేను అగ్నిలో పోగొట్టుకుంటాను” (కీర్తన. 18:1; 19:14; నిర్గమ. 22:28తో పోల్చి చూడు). సివిల్ వార్‌లో డ్రమ్ము కొట్టే ఒక యువకుని జీవిత విధానంవలన దేవునియందలి నమ్మకం సరిగా ఉదహరింపబడింది. చలికాలపు యుద్ధంలో ఎదురయ్యే కష్టాలను గూర్చి వర్ణనతో అతడు యింటికి ఉత్తరం వ్రాస్తూ – కొరుక్కు తింటున్న చలి, దయలేని గాలి, ఆకలి, విస్తృంగా సహించిన హీనతలను గూర్చి తెలిపాడు. అతడు దాన్ని ముగించుతూ ఈ మాటలు వ్రాశాడు: “అయితే, అమ్మా, యిది మా బాధ్యత, మా బాధ్యత నిమిత్తం మేము చస్తాం.” అలాటి నమ్మకం దేవునితో ఉండే బాంధవ్యంలో కనబరచాలి.

**కుటుంబానికి లేక స్నేహితులకు నమ్మకం అనేది ఎన్నడు తప్పను చూడక విడిచిపెట్టదు.** అది ఎల్లప్పుడు దానిని ఎదుర్కొంటుంది! యోనాతాను సౌలును ప్రేమించి, సందేహించని నమ్మకం కలిగియున్నాడు, కాని ఆ ప్రేమ అతని మౌనంగా ఉండనీయ లేదు. న్యాయము, నీతి, మరియు సత్యము అనేవాటి విషయంలో అతడు మాట్లాడవలసి వచ్చింది! (19:1-6; 20:30-33). మన జీవితాల్లో, కుటుంబం లేక ప్రియమైన స్నేహితులు తప్పు చేసి, దిద్దుబాటు కావలసిన అవసరంలో ఉన్నప్పుడు, మౌనంగా ఉండడం సులభమే. “నేను చెప్పడానికి వీలులేనంత సన్నిహితంగా ఉన్నాను” అని మనం చెప్పవచ్చు. ఆలాటి స్వభావం మంచిది కాదు! (లేక సరియైనది కాదు)! (సామె. 27:6, 9, 17; గలతీ. 4:16).

**ఆత్మీయుడైన స్నేహితుడు మరణించినప్పుడు, నమ్మకం గాఢమైన స్మృతులను కలిగిస్తుంది.** యోనాతాను యొక్క జ్ఞాపకాలు 2 సమూ. 1:19-27లోని మాటలు వెలిగిస్తున్నాయి:

> ఇశ్రాయేలూ, నీకు భూషణమగువారు
> నీ ఉన్నత స్థలములమీద హతులైరి
> అహహా బలాఢ్యులు పడిపోయిరి.
> ఫిలిష్తీయుల కుమార్తెలు సంతోషింపకుండునట్లు
> సున్నతిలేనివారి కుమార్తెలు జయమని చెప్పకుండునట్లు
> ఈ సమాచారము గాతులో తెలియజేయకుడి.

అష్కెలోను వీధులలో ప్రకటన చేయుడి.
గిల్బోవ పర్వతములారా
మీమీద మంచైనను వర్షమైనను
ప్రథమ ఫలార్పణకు తగిన పైరుగల చేలైనను
లేకపోవును గాక.
బలాఢ్యుల డాళ్లు అవమానముగ పారవేయబడెను.
తైలముచేత అభిషేకింపబడని వారిదైనట్టు
సౌలు డాలును పారవేయబడెను.
హతుల రక్తము ఒలికింపకుండ
బలాఢ్యుల క్రొవ్వును పట్టకుండ
యోనాతాను విల్లు వెనుకతియ్యలేదు.
ఎవరిని హతముచేయకుండ సౌలు కత్తి వెనుక తీసినది కాదు.
సౌలును యోనాతానును తమ బ్రతుకునందు సరసులుగాను
 నెనరుగల వారుగాను ఉండిరి.
తమ మరణమందైనను వారు ఒకరినొకరు ఎడబాసినవారు కారు.
వారు పక్షిరాజులకంటె వడిగలవారు.
సింహములకంటె బలముగలవారు.
ఇశ్రాయేలీయుల కుమార్తెలారా, సౌలును గూర్చి యేడ్వుడి.
అతడు మీకు ఇంపైన రక్తవర్ణపు వస్త్రములు ధరింపజేసినవాడు.
బంగారు నగలు మీకు పెట్టినవాడు.
యుద్ధరంగమునందు బలాఢ్యులు పడియున్నారు.
నీ ఉన్నతస్థలములలో యోనాతాను హతమాయెను.
నా సహోదరుడా, యోనాతానా
నీవు నాకు అతిమనోహరుడవై యుంటివి.
నీ నిమిత్తము నేను బహు శోకము నొందుచున్నాను.
నాయందు నీకున్న ప్రేమ బహు వింతైనది.
స్త్రీలు చూపు ప్రేమకంటెను అది అధికమైనది.
అయ్యయ్యో బలాఢ్యులు పడిపోయిరి
యుద్ధసన్నద్ధులు నశించిపోయిరి.

యోనాతాను పట్ల స్నేహపు జ్ఞాపకాలు దావీదుకు ఎల్లప్పుడు ఆహ్లాదకరంగా ఉండేవి (2 సమూ. 1:26, 27ఎ).

**నమ్మకం రానున్న తరాలకు కూడా దాని ఫలితాన్ని యిస్తుంది.** 20:42లోని మాటలు 2 సమూ. 9:1-13 మరియు 2 సమూ. 21:1-7ల్లో నెరవేర్చబడ్డాయి. యోనాతానుకు గల నమ్మకం పితరులు సంపాదించిన దాని హక్కును దీవెనగా నిలిపింది. సౌలు తిరుగుబాటుకు ఫలితంగా కుటుంబం క్షీణతలోనికి, స్పష్టంకాని స్థితిలోనికి దిగజారింది - యోనాతాను నమ్మకం వలన ప్రత్యేకమైన స్థాయికి అది ఎదిగింది.

## ముగింపు

క్రైస్తవ సద్గుణాలలో అనేకమైనవి యోనాతానునందు మూర్తీభవించినవి. అతని సద్గుణాలన్నిటిలో ప్రధానమైనది నమ్మకం. గిల్బోవ పర్వతం మీద జరిగిన ఘోరమైన

యుద్ధమందు అతడు మరణించాడు, కాని ఫిలిష్తీయుల గెలుపు ఎన్నడు తుడిచి పెట్టలేని మహా ఘనమైన విజయాన్ని తన జీవితం ద్వారా అతడు సాధించాడు. యోనాతాను దుష్ట కోర్కెలపైనను, కోపము, అసూయ అనేవాటిపైనను ఘన విజయాన్ని పొందాడు. అతని అత్యున్నతమైన విజయం ఒకే మాటతో సంక్షిప్తంగా వర్ణించబడింది – **నమ్మకం!**

దేవునిపట్ల నీ నమ్మకత్వం అదుపులో ఉందా లేక నిన్ను **స్వాధీనపరచుకొంటుందా?** స్నేహితుల పట్ల నీ నమ్మకం పరిచర్య చేస్తుందా? కుటుంబం పట్ల నీకున్న నమ్మకం అక్కర కలిగినదిగా ఉందా?